సాక్షి విశాఖపట్నం

శనివారం। 25। ఫిబ్రవరి। 2023



బీభత్సం.. భయానకం

ఎస్.రాయవరం మండలంలోని పి.ధర్మవరం జంక్షన్‌లో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, 25 మంది గాయపడ్డారు. 8లో



ప్రత్యేక రైళ్లు కొనసాగింపు

ప్రత్యేక రైళ్లను మరికొంతకాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు. 8లో



కేఎఫ్‌సీలో తనిఖీలు

డైమండ్ పార్కు వద్ద ఉన్న కేఎఫ్‌సీ అవుట్‌లెట్‌లో ఆహార భద్రత అధికారులు తనిఖీలు చేపట్టారు. 8లో

న్యూస్‌రీల్

అప్పన్నను దర్శించుకున్న సీతారామమూర్తి



ఆశీర్వచనం స్వీకరిస్తున్న జస్టిస్ సీతారామమూర్తి

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని శుక్రవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ గౌరవాధ్యక్షుడు జస్టిస్ ఎమ్.సీతారామమూర్తి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని,శేషవస్త్రాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

పలు ప్రాంతాల్లో సీపీ పర్యటన



సదస్సు జరిగే ప్రాంతాలను పరిశీలిస్తున్న సీపీ సీహెచ్ శ్రీకాంత్

అల్లిపురం (విశాఖ దక్షిణ): నగరంలో మార్చి 3,4 తేదీలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్స్ నేపథ్యంలో పలు ప్రాంతాల్లో నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ శుక్రవారం పర్యటించారు. అధికారులతో కలసి ఆయన సమ్మిట్ జరిగే ప్రాంతాలను, జరుగుతున్న ఏర్పాట్లను తెలుసుకున్నారు. సదస్సు జరిగే ప్రాంతాలను వీఐపీలు, పారిశ్రామిక వేత్తలు సందర్శించే ప్రాంతాలలో ఆయన విస్తృతంగా పర్యటించి, ప్రతి విభాగానికి ఒక అధికారిని నియమించాలని ఆదేశించారు.సదస్సు జరిగే ప్రాంతాల్లో స్నిఫర్ డాగ్స్‌తో పాటు అడ్వాన్స్ యాంటి సాబోటేజ్ చెక్ టీమ్స్‌తో తనిఖీలు నిర్వహించారు.

చేనేత వస్త్రాలను ఆదరించాలి



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న జేసీ విశ్వనాథన్

ఏయూక్యాంపస్: చేనేత వస్త్రాలను ప్రోత్సహించాలని జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ అన్నారు. శుక్రవారం ఏయూ పోలమాంబ మైదానంలో జిల్లా చేనేత జౌళిశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చేనేత వస్త్రాల ప్రదర్శన, విక్రయాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రదర్శన తిలకించి, విక్రయాలకు ఉంచిన వస్త్రాలను ఆయన పరిశీలించారు. ప్రదర్శనలో ధర్మవరం, వెంకటగిరి, పుత్తూరు, చీరాల, ఉప్పాడ, బొబ్బిలి తదితర ప్రాంతాలకు చెందిన కాటన్, సిల్క్ చీరలు, మంగళగిరి డ్రస్ మెటీరియల్స్, పోచంపల్లి, చందేరి వస్త్రాలు, తువ్వాళ్లు, కార్పెట్లు, లుంగీలు, పొందూరు పంచెను విక్రయాలకు ఉంచారు. ఫిబ్రవరి 9వ తేదీ వరకు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు విక్రయాలు ఉంటాయని రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ బి.ధనుంజయ రావు తెలిపారు. విభిన్న ప్రాంతాల నుంచి వచ్చిన చేనేత వస్త్రాలతో కూడిన 105 విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి ఆర్.వి మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో వీవర్స్ వెల్ఫేర్ సెంటర్ డి.డి టి.ఎస్.ఎన్ రెడ్డి, జౌళిశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూలో రమణ గోగుల



ప్రసంగిస్తున్న రమణగోగుల

ఏయూక్యాంపస్ : ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని ప్రముఖ సంగీత దర్శకుడు రమణ గోగుల సందర్శించారు. శుక్రవారం ఏయూ అర్థశాస్త్ర విభాగంలో విద్యార్థులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. తమ ఆసక్తి, సామర్థ్యాలకు అనుగుణంగా విద్యార్థులు పని చేయాలన్నారు. స్ఫూర్తిదాయకమైన కెరియర్‌ను నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య ఎస్.పుల్లారావు, విభాగ ఆచార్యులు నాగరాజ, లిల్లీ గ్రేస్, ఆశాలత, రామకృష్ణ తతదితరులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

బీచ్..బ్యూటీ.. బిజినెస్..!



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

- అడుగడుగునా ఆంధ్ర సౌరభం
- 26 కిలోమీటర్ల మేర 7 లక్షల మొక్కల పెంపకం
- కొత్త బీచ్‌ల అభివృద్ధి... మరింత అందంగా సముద్ర తీరం
- సరికొత్త వైజాగ్‌ను పరిచయం చేస్తాం

ఒకవైపు బీచ్ అందాలను...మరోవైపు వైజాగ్ బ్యూటీని విదేశీ, దేశీయ అతిథులతో పాటు పారిశ్రామికవేత్తలకు పరిచయం చేసేందుకు నగరం సిద్ధమవుతోంది. నగరంలోకి ప్రవేశించినప్పటి నుంచి ఆత్మీయ స్వాగతంతో పాటు అడుగడుగునా విశాఖ అందాలను కనువిందు చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)తో పాటు జీ–20 సదస్సుకు విచ్చేయనున్న అతిథులకు విమానం దిగిన తర్వాత సంప్రదాయపద్ధతిలో స్వాగతం పలకనున్నారు. అంతేకాకుండా అక్కడి నుంచి బయలుదేరిన తర్వాత ఎన్ఏడీ జంక్షన్, తాటిచెట్లపాలెం, ఆంధ్రాయూనివర్సిటీ ప్రధాన ద్వారం, సిరిపురం, ఆర్కే బీచ్ మీదుగా జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్ మీదుగా రాడిసన్ హోటల్ వరకూ విశాఖ నగర అందాలు ఉట్టిపడేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

'సరికొత్త వైజాగ్‌ను పరిచయం చేసేందుకు గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ ఆధ్వర్యంలో అతిథులను వైజాగ్ అందాలు కట్టిపడేసేలా చర్యలు తీసుకుంటున్నాం. జీ–20 సదస్సు నేపథ్యంలో పనులను చేపట్టేందుకు ఎన్నికల కోడ్ అడ్డంకి కూడా తొలగిపోయింది. ఎన్నికల కమిషన్ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది' అని జీవీఎంసీ కమిషనర్ రాజబాబు తెలిపారు. నగర ప్రజలందరూ ఇందుకు సహకరించాలని ఆయన కోరారు. జీఐఎస్, జీ–20 సదస్సు నేపథ్యంలో జీవీఎంసీ చేపడుతున్న చర్యలను ఆయన 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

జీ–20కు విచ్చేయనున్న అతిథులకు ఆంధ్ర సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేసే విధంగా స్వాగతం పలుకుతాం. కళాజాత కార్యక్రమాలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తాం. ప్రధానంగా మన రాష్ట్రంలో ఉన్న ప్రత్యేక కళారూపాల ద్వారా అతిథులను ఆత్మీయంగా పలకరింపుతో పాటు స్వాగతాంజలి ఉంటుంది. ఇక విమానాశ్రయం నుంచి వారు ప్రయాణించే మార్గంలో రోడ్డు మొత్తం జీ–20 బ్రాండింగ్ ఏర్పాటు చేస్తున్నాం. ఎక్కడికక్కడ సెంట్రల్ మెరీడియన్‌లో లైట్లతో అలంకరించడంతో పాటు ఫ్లవర్ షోతోపాటు రోడ్డుకు అటుఇటుగా చక్కటి పెయింటింగ్స్ అలరించేలా ప్లాన్ చేస్తున్నాం. 26 కిలోమీటర్ల మేర 7 లక్షల మొక్కల పెంపకం చేపట్టనున్నాం. వైజాగ్‌కు ప్రకృతి ఇచ్చిన అందం ఉంది. దీనికి అదనంగా మరింత అందంగా తీర్చిదిద్దే పనిని చేపడుతున్నాం. విశాఖను మరింత ఎంజాయ్ చేసే విధంగా ప్లానింగ్ చేస్తున్నాం. ఇక రోడ్డుకు అటుఇటువైపుగా ఉన్న పేవ్‌మెంట్స్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నాం.

మరింత దగ్గరగా సముద్ర అందాలు

ఇప్పటికే ఉన్న బీచ్‌లతో పాటు కొత్త బీచ్‌లను అభివృద్ధి చేస్తున్నాం. జోడుగుళ్లపాలెం, సీతకొండ వద్ద వ్యూ పాయింట్ అభివృద్ధి చేస్తున్నాం. ఇక్కడి నుంచి మరింతగా సముద్రపు అందాలను వీక్షించే అవకాశం ఉంది. ఆ తర్వాత సాగర్‌నగర్ వద్ద బీచ్‌ను అభివృద్ధి చేస్తున్నాం. ఇప్పటికే ఉన్న బీచ్‌లకు ఇవి అదనంగా ఏర్పాటవుతున్నాయి. అంతేకాకుండా మొత్తం సముద్ర తీరం మరింత స్పష్టంగా కనిపించేందుకు వీలుగా లైటింగ్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే బీచ్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు వీలుగా చర్యలు తీసుకుంటున్నాం. విశాఖకు రానున్న అతిథులకు విశాఖను మరింతగా పరిచయం చేసేందుకు ఈ కార్యక్రమాలు దోహదం చేస్తాయి. ఈ అవకాశాన్ని మేం సమర్థవంతంగా ఉపయోగించుకుంటాం.

జన్‌బాగ్‌దారీ..

జీ–20లో నగర ప్రజలను కూడా భాగస్వామ్యం చేస్తాం. ప్రజలను భాగస్వామ్యం చేస్తూ మార్చి 5వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ జన్‌బాగ్‌దారీ యాక్టివిటీస్‌ను నిర్వహిస్తాం. సైకిల్ మారథాన్, వాకింగ్ మారథాన్, రన్నింగ్ మారథాన్ వంటి కార్యక్రమాలతో పాటు సిటీ మొత్తం స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమం చేపడతాం. అంతేకాకుండా వైజాగ్ గాట్ టాలెంట్ పేరుతో ఆర్కే బీచ్ వద్ద ఔత్సాహికుల కోసం ప్రత్యేకంగా స్టేజీ ఏర్పాటు చేస్తున్నాం. యువతీ, యువకులు వారికి ఉన్న టాలెంట్‌ను పరిచయం చేసుకునేందుకు ఈ స్టేజీ వీలు కల్పించనుంది. రిజిస్టర్ చేసుకుని ఇందులో పాల్గొనే అవకాశం కల్పించనున్నాం. అంతేకాకుండా పెయింటింగ్, వక్తృత్వ పోటీలను కూడా నిర్వహిస్తాం. కాలేజీ, యూనివర్సిటీ విద్యార్థులతో మాక్ జీ–20ను నిర్వహించనున్నాం.

అతిథుల కోసం...!

జీ–20 సదస్సుకు వస్తున్న అతిథుల కోసం ప్రత్యేకంగా 30వ తేదీన వైజాగ్‌లో ఎంపిక చేసిన కొన్ని ప్రాంతాలను పరిచయం చేయనున్నాం. కాపులుప్పాడలోని చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి తయారు చేస్తున్న ప్రాంతం.. దీనిని వేస్ట్ టు వెల్త్ ఏరియాగా పరిచయం చేస్తున్నాం. ఇందుకోసం ప్రత్యేకంగా ప్రవేశద్వారాన్ని ఏర్పాటు చేస్తున్నాం. ఇక్కడ ఏ విధంగా విశాఖపట్నంలోని చెత్తను విద్యుత్‌గా మార్చుతున్నామన్న విషయాన్ని వివరించేందుకు వీలుగా ఉంటుంది. అదేవిధంగా ముడసర్లోవలోని నీటిపై తేలియాడే సౌర విద్యుత్ ప్లాంటును సందర్శించే విధంగా ప్లాన్ చేస్తున్నాం. దీంతో పాటు నరవ వద్ద మురికినీటిని శుద్ధి చేసి మంచినీటిగా మార్చే ట్రీట్‌మెంట్ ప్లాంటును చూపించనున్నాం. ఈ నీటిని పరిశ్రమలకు సరఫరా చేస్తున్నాం. సముద్రతీరం ద్వారా వ్యాపార అవకాశాలనూ వివరించే ప్రయత్నం చేస్తాం. మొత్తంగా వైజాగ్ బీచ్...బ్యూటీతో పాటు అభివృద్ధి కేంద్రంగా ఎలా మారుతుందన్న అంశాన్ని అతిథులకు చూపించనున్నాం.



బీచ్ రోడ్డులో మెరుగులు



ఐటీ సెజ్ రోడ్డులో వివిధ ఆకృతుల్లో చెట్లు

నాలుగు నామినేషన్ల తిరస్కరణ

- స్క్రూటినీ పూర్తి చేసిన రిటర్నింగ్ అధికారి మల్లికార్జున
- ఇప్పటి వరకూ బరిలో 40 మంది
- 27 వరకూ ఉపసంహరణకు గడువు



నామినేషన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ఎన్నికల పరిశీలకులు సిద్ధార్థ్ జైన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున, ఎన్నికల పరిశీలకులు సిద్ధార్థ్ జైన్ సమక్షంలో శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 16వ తేదీ నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి 23వ తేదీ వరకూ మొత్తం 44 మంది అభ్యర్థులు 70 సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ వేసిన అభ్యర్థులు, ఆయా అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో మొత్తం 70 సెట్లు నామినేషన్లను కలెక్టర్ స్క్రూటినీ చేశారు. విశాఖ జిల్లాకు చెందిన ఇమామ్ మోహియుద్దీన్ అహ్మద్, రుద్రరాజు కల్యాణ వర్మ నామినేషన్లను తిరస్కరించారు. విజయనగరం జిల్లాకు చెందిన బొలిశెట్టి వెంకటేశ్వరరావు, అనకాపల్లి జిల్లాకు చెందిన కొలుపురి నాగభారతి నామినేషన్లను తిరస్కరించారు. మొత్తం 44 నామినేషన్లకు సంబంధించి నాలుగు నామినేషన్లు తిరస్కరించినట్లు కలెక్టర్ డా. మల్లికార్జున వెల్లడించారు. ఈనెల 27 వరకు నామినేషన్లు ఉపసంహరణకు గడువు ఉందని తెలిపారు. ఈ పరిశీలనలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ శ్రీనివాస్ మూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

రమాప్రభ తప్పుదోవ పట్టించేలా..

ప్రజా సంఘాల మద్దతు అభ్యర్థిగా బరిలోకి దిగిన కోరెడ్ల రమాప్రభ నామినేషన్ల దాఖలు విషయంలో అధికారులను తప్పుదోవ పట్టించేలా వ్యవహరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈమె మొత్తం 4 నామినేషన్ సెట్లు దాఖలు చేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం నామినేషన్ పత్రాలతో పాటు ఫారం–26ని స్వదస్తూరితో ప్రతి సెట్‌కు ఒరిజినల్‌ను జత చేర్చాల్సి ఉంటుంది. అయితే రమాప్రభ మాత్రం రెండు సెట్లకు ఒరిజినల్స్‌ను జత చేసి.. మిగిలిన రెండు సెట్లకు ఒరిజినల్స్‌ను పోలి ఉండేలా కలర్ జిరాక్స్‌లని జతపరిచారు. స్క్రూటినీ చేసే సమయంలో క్షుణ్ణంగా పరిశీలించిన రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున ఆ రెండు సెట్లకు జిరాక్స్‌లు జతపరచడాన్ని గుర్తించి వాటిని తిరస్కరించారు. దీనిపై పలు రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా విమర్శలు చేస్తున్నారు.

నాణ్యతలో రాజీ వద్దు

- ఔషధ ఉత్పత్తి పరిశ్రమలు పనితీరు మెరుగుపరుచుకోవాలి
- ఎఫ్‌డీఏ డైరెక్టర్ డాక్టర్ కార్మెలో రోసా



ప్రసంగిస్తున్న ఎఫ్‌డీఏ డైరెక్టర్ కార్మెలో రోసా

ఏయూక్యాంపస్ : భారతీయ ఔషధ ఉత్పత్తి పరిశ్రమలు తమ నాణ్యతా వ్యవస్థలను నిరంతరం మెరుగు పరుచుకోవాలని అమెరికాలోని ఎఫ్‌డీఏ డ్రగ్ క్వాలిటీ డివిజనల్ డైరెక్టర్ డాక్టర్ కార్మెలో రోసా అన్నారు. శుక్రవారం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఏయూ యూఎస్ ఎఫ్‌డీఏ సంయుక్తంగా నిర్వహించిన 'కరెంట్ గుడ్ మ్యానుఫాక్చరింగ్ ప్రాక్టీసెస్' రెండు రోజుల వర్క్‌షాప్‌లో రెండో రోజు ఆయన 'బలమైన నాణ్యత వ్యవస్థను నిర్మించడం' అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన ఔషధాల తయారీకి నిరంతరం కృషి జరగాలన్నారు. ఫార్మా పరిశ్రమలు పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. ఎఫ్‌డీఏ వద్ద సమగ్ర సమాచారం ఉంటుందనే వాస్తవాన్ని పరిశ్రమలు విస్మరించరాదన్నారు. కొన్ని సందర్భాలలో ఫొటోలతో కూడిన వివరాలు సైతం తమ వద్ద అందుబాటులో ఉంటాయన్నారు. అవసరమైన సందర్భాలలో తనిఖీలు చేసి పరీక్షించడం, నాణ్యతా ప్రమాణాలు అనుసరించడంలో విఫలమైన వాటిని గుర్తించడం జరుగుతుందన్నారు.

నాణ్యత పరీక్షలో విఫలమైన ఔషధాలు రోగిపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతాయనే విషయాన్ని ఆలోచించాలని సూచించారు. నాణ్యత ప్రమాణాల పరీక్షలో విఫలం కావడానికి మూల కారణాలు, రిస్క్ అసెస్‌మెంట్ తదితర అంశాలను వివరించారు. నమూనాల సేకరణ విధానాలు, రివ్యూ చేసుకునే విధానం, నాణ్యత ప్రమాణాల వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించడం తదితర అంశాలలో అనుసరించాల్సిన విధానాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. సర్వసాధారణంగా పరిశ్రమల్లో జరిగే లోపాలు గుర్తించే విధానాలను వివరించారు.

యూఎస్ కన్జ్యూమర్ సేఫ్టీ ఆఫీసర్ సలీమ్ అక్తర్ రికార్డులను రూపొందించడం, భద్రపరచడం, హౌటు ఎన్‌ష్యూర్ డాక్యుమెంటేషన్ కంట్రోల్స్ అంశంపై ప్రసంగించారు. సీనియర్ పాలసీ అడ్వయిజర్ బ్రూక్ హిగ్గిస్ ప్రోసెస్ ధ్రువీకరణ అసెప్టిక్ కార్యకలాపాలు అంశంపై ప్రసంగించారు. వోఆర్ఏ నేషనల్ ఎక్స్‌పర్ట్‌జోస్ మెలెంజ్ ,అమెరికాకు చెందిన వయాట్రిస్ గ్లోబల్ క్వాలిటీ వైస్ ప్రెసిడెంట్ దేవ పురాణం, ఏయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఇ.ఎస్.ధనుంజయ రావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం సమష్టిగా పనిచేద్దాం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు
- అనుబంధ సంస్థలు, కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లకు సన్మానం
- ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజును గెలిపించుకుందాం



పంచకర్లను సత్కరిస్తున్న అనుబంధ సంఘాలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు

మహారాణిపేట (విశాఖ దక్షిణ) : రానున్న 2024 ఎన్నికల కోసం ఇప్పటి నుంచే శ్రమించాల్సి ఉంది. అంతా సమష్టిగా పనిచేయాలి. సంక్షేమం..అభివృద్ధి రెండు కళ్లుగా ప్రభుత్వం పాలన సాగిస్తోంది. ప్రభుత్వ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లో మరింతగా తీసుకువెళ్లే బాధ్యత అందరిపై ఉంది.. అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు అన్నారు.

మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో జిల్లా నూతన అనుబంధ విభాగ అధ్యక్షులు, పునఃనియమితులైన రాష్ట్ర బీసీ కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పంచకర్ల హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి మంచి నాయకులను అందించారని, రానున్న 2024 ఎన్నికల్లో పార్టీని విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లే బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి కృషి చేయాలని చెప్పారు. నూతనంగా నియమితులైన అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ ఛైర్మన్, డైరెక్టర్లను పంచకర్ల అభినందించారు.

అనంతరం వీరంతా కలిసి పంచకర్లను సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ల ఛైర్మన్లు కోలా గురువులు, పిల్లా సుజాత, పిల్లి సుజాత, బొడ్డు అప్పల కొండమ్మ, కంటి మహంతి అనూషా పట్నాయక్, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్, పార్టీ ముఖ్య నాయకులు రవిరెడ్డి, అల్లంపల్లి రాజు బాబు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు అల్లా శివగణేష్, అదాల కృపా జ్యోతి, మోకర అప్పల నాయుడ, బోని శివ రామ కృష్ణ, పెంద్ర అప్పన్న, నమ్మి లక్ష్మణ్ రావు,కలిదండి భద్రీనాథ్,వానపల్లి ఈశ్వర్ రావు, బయవరపు రాధ, వంకాయల మారుతి ప్రసాద్, ఎజ్జల ప్రేమ బాబు, కోరాడ అప్పల స్వామి నాయుడు, చిక్కా సత్యనారాయణ, బోండా ఉమామహేశ్వరరావు, లెంక రాంబాబు, అబిడేపల్లి రవిబాబు, దొడ్డి రామనాథ, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా రాంబాబు

విశాఖ లీగల్: విశాఖ న్యాయవాదుల సంఘం నూతన అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది చింతపల్లి రాంబాబు ఎన్నికయ్యారు. న్యాయవాదుల సంఘం వార్షిక ఎన్నికలు శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో జరిగాయి. 2,127 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారి జి.ఎం. రెడ్డి, ఉప ఎన్నికల అధికారి ఎం.కె శ్రీనివాసు ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. మొత్తం 2,828 మంది అర్హులైన న్యాయవాదులు సభ్యులు ఉండగా జూనియర్ న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు. న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షురాలిగా బి.ఎస్.లత ఆధిక్యతలో ఉన్నారు. కీలకమైన ప్రధాన కార్యదర్శి పదవిని న్యాయవాది పైలా శ్రీనివాస్ దక్కించుకున్నారు.



రాంబాబు

న్యాయవాదుల సంక్షేమమే లక్ష్యం : న్యాయవాదుల సంక్షేమమే తన లక్ష్యమని నూతన అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు అన్నారు. ముఖ్యంగా రాజధానిగా ఎదుగుతున్న విశాఖలో నూతన న్యాయస్థానాల ప్రారంభోత్సవం, కొత్త కోర్టుల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పన, న్యాయవాదుల లా అకాడమీ ఏర్పాటు వంటివి తన లక్ష్యంగా చెప్పారు.

అనుమతుల్లేని స్కూళ్లపై ఆరా

- విశాఖలోని ప్రైవేటు స్కూళ్లపై స్పెషల్ డ్రైవ్
- ఉత్తర్వులు జారీ చేసిన డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: విశాఖ నగరంలోని ప్రైవేటు స్కూళ్ల నిర్వహణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. నగరంలోని సీతమ్మధారలో ఉన్న జిజ్ఞేలేస్ ప్లే స్కూల్‌లో విద్యార్థులను ఎండలో నిలబెట్టిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో దీనిపై డీఈవో చంద్రకళ సమగ్ర విచారణకు ఆదేశించారు. స్కూల్ నిర్వహణకు అనుమతులు లేనందున, వెంటనే మూసివేస్తున్నట్లు ప్రకటించారు. విద్యాహక్కు చట్టం మేరకు రూ.1 లక్ష జరిమానా ఎందుకు విధించరాదో తెలపాలని నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. సదరు ఉపాధ్యాయురాలిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సిఫార్స్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటివి మళ్లీ చోటుచేసుకోకుండా తమ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. శుక్రవారం డిప్యూటీ డీఈవో, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్ (అర్బన్), మండల విద్యాశాఖాధికారులతో సమీక్షించి, తనిఖీలపై ఎలా ముందుకెళ్లాలనే దానిపై దిశానిర్దేశం చేశారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నగరంలోని అన్ని ప్రైవేటు స్కూళ్ల నిర్వహణ, ప్రభుత్వ పరంగా వాటికి ఉన్న అనుమతులపై సమగ్ర వివరాలను సేకరించాలని ఆమె సూచించారు. అయితే విద్యాశాఖలోని కొంతమంది దిగువ స్థాయి అధికారుల ఉదాసీనత వల్లనే నగరంలో ప్లే స్కూళ్ల పేరుతో ఎటువంటి అనుమతులు లేకుండా, పాఠశాలలు నిర్వహిస్తున్నారని విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించే అధికారులు అనుమతుల్లేని ప్రైవేటు స్కూళ్లను ముందుగానే గుర్తించినట్లైతే, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది ఉండవు. భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తప్పుదోవ పట్టించేలా 'ఈనాడు' రాతలు

సీతమ్మధార: ప్రజలను తప్పుదోవ పట్టించేలా 'ఈనాడు' దుర్మార్గపు వార్తలు ప్రచురించడం బాధాకరమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. గన్నవరం ఘటనలో ఈనాడు తీరుకు నిరసనగా జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయ ఆవరణలో ఆ పత్రిక ప్రతులను పార్టీ శ్రేణులు తగలబెట్టారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ రామోజీరావు దిగజారి.. తన పత్రిక ద్వారా విషపు రాతలు రాస్తున్నారని ఆరోపించారు. విజ్ఞత లేకుండా మాట్లాడిన పట్టాభి పాత ఫొటోలతో వార్తను ప్రచురించి.. ఈనాడు పత్రికా విలువలను గాలికొదిలేసిందన్నారు. ఈ సంఘటనపై పత్రికా యాజమాన్యం బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, స్టాండింగ్ కమిటీ సభ్యుడు భర్కత్ ఆలీ, కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, రెయ్యి వెంకటరమణ, కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత, కె.వి.బాబా, దేముడు బాబు, విశాఖ జిల్లా మహిళా అధ్యక్షురాలు కృపా, గుజ్జు వెంకటరెడ్డి, పైడి రమణ, రాయుడు శ్రీనివాస్, వాసు, మాజీ కార్పొరేటర్ వెంగళరావు, రాధ, శైలేష్, వరలక్ష్మి, పావని తదితరులు పాల్గొన్నారు.

బీభత్సం.. భయానకం

- ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొన్న లారీ
- ఇద్దరు మృతి.. 25 మందికి గాయాలు
- బస్సు డ్రైవర్ అప్రమత్తతతో పరిమితమైన ప్రాణనష్టం


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పరసయ్యను మోసుకొని వస్తున్న ఎస్ఐ ప్రసాదరావు.. కాసేపటికే అతను మరణించాడు..


ప్రమాదానికి కారణమయిన లారీ

ఎస్.రాయవరం: పెద్ద శబ్దం.. స్థానికులు ఏమిటా అని చూసేసరికి.. వరాహ నది కాలువలోకి దూసుకుపోయిన బస్సు.. తుక్కుతుక్కయిన బస్సు వెనుకభాగం.. పక్కనే నుజ్జయిన ఆటో.. చెల్లాచెదురుగా క్షతగాత్రులు.. ఆర్తనాదాలు.. హాహాకారాలు.. ఎస్.రాయవరం మండలంలోని పి.ధర్మవరం జంక్షన్‌లో జాతీయరహదారిపై శుక్రవారం జరిగిన ప్రమాద బీభత్సమిది.. ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును లారీ ఢీకొనడంతో ఈ దుర్ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా.. 25 మంది గాయపడ్డారు. ఐదుగురు తీవ్ర గాయాలతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. వివరాలివీ.. అనకాపల్లి నుంచి పాయకరావుపేట వెళుతున్న బస్సు పి.ధర్మవరం జంక్షన్‌లో ఆగింది. నలుగురు ప్రయాణికులు దిగారు. మరో ఇద్దరు ఎక్కుతుండగా వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ప్రయాణికులు ఎక్కిన వెంటనే స్టార్ట్ చేద్దామనే ఆలోచనతో ఎగువ ప్రాంతంలో బస్సును నిలిపి, స్టీరింగ్ పట్టుకుని డ్రైవర్ అప్రమత్తంగా ఉన్నారు. అదే ప్రయాణికులను కాపాడింది. లేకుంటే వరాహనది బ్రిడ్జికి అతి సమీపంలో ఉండడంతో బస్సు బోల్తా కొడితే తీవ్ర ప్రాణనష్టం జరిగి ఉండేది. ప్రమాదం జరిగే సమయానికి బస్సులో 48 మంది ప్రయాణికులు ఉన్నారు. యలమంచిలి వైపు నుంచి తుని వైపు వెళుతున్న పంజాబ్ లారీ అతివేగంగా వచ్చి బస్సును వెనుక నుంచి ఢీకొని, అదే వేగంతో డివైడర్ దాటి అవతలి రోడ్డుపైకి దూసుకుపోయింది. ఆ సమయానికి బస్సు సమీపంలో ఒక ఆటో కూడా ఉంది. లారీ ఢీకొనడంతో బస్సు, ఆటో పక్కనున్న వరాహ నది కాలువలోకి దూసుకుపోయాయి. వెంటనే స్థానికులు, పోలీసులు స్పందించడంతో క్షతగాత్రులకు తక్షణ వైద్యసేవలు అందాయి. గాయ పడిన వారిని నక్కపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు ఆటోలు, 108 వాహనంలో తరలించారు. ఎస్.రాయవరం ఎస్ఐ ప్రసాదరావు క్షతగాత్రులను మోసుకొని పైకి తీసుకువచ్చి ఆస్పత్రికి పంపించారు. క్షతగాత్రుల ఆర్తనాదాలతో నక్కపల్లి ఆస్పత్రి ప్రాంగణం దద్దరిల్లింది.

కూటి కోసం వచ్చి కాటికి.. : ప్రమాదంలో తలకు గాయమైన ఇసుకతోట ప్రాంతానికి చెందిన మడపల్లి పరసయ్య (50) నక్కపల్లి ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించారు. ఇతను నక్కపల్లి పరిసర ప్రాంతాల్లో ఉన్న కంపెనీల్లో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. స్థానికంగా నివాసం ఉంటూ వారానికి ఒక రోజు విశాఖలో కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి వస్తుంటారు. బస్సు వెనుక భాగంలో కూర్చున్న ఎస్.రాయవరం మండలం పెద గుమ్ములూరుకు చెందిన ఏజెర్ల నారాయణరాజు (52) వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలయ్యారు. ఆయన్ని నక్కపల్లి ఆస్పత్రికి తరలించి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ తీసుకువెళుతుండగా మార్గమధ్యలో మరణించారు. ఇతను కూడా రోజువారీ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. గాజువాక చెందిన అనంతలక్ష్మి అనే మహిళ పాయకరావుపేట వెళుతోంది. ఈ ప్రమాదంలో ఆమెకు కాలు విరిగిపోయింది. విశాఖపట్నానికి చెందిన ఎం.సత్యనారాయణ, పి.శేషులతో పాటు ఆటోడ్రైవర్ గొర్ల కృష్ణ, లారీ క్లీనర్ సుఫీమర్, బస్సు డ్రైవర్ ఇసరపు రమణ, కండక్టర్ కె.లక్ష్మి.. మొత్తం 25 మందికి గాయాలయ్యాయి.

ప్రత్యేక రైళ్లు కొనసాగింపు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రస్తుతం నడుస్తున్న ప్రత్యేక రైళ్లను మరికొంతకాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. • **విశాఖపట్నం–సికింద్రాబాద్(08579)** వీక్లీ స్పెషల్ ప్రతీ బుధవారం విశాఖపట్నంలో రాత్రి 7 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8.20 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు మార్చి ఒకటో తేదీ నుంచి ఏప్రిల్ 26 వరకు నడుస్తుంది. సికింద్రాబాద్–విశాఖపట్నం (08580) వీక్లీ స్పెషల్ సికింద్రాబాద్‌లో ప్రతీ గురువారం రాత్రి 7.40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.40 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైలు మార్చి 2 నుంచి ఏప్రిల్ 27వ తేదీ వరకు నడుస్తుంది. • **విశాఖపట్నం–మహబూబ్‌నగర్(08585)** వీక్లీ విశాఖపట్నంలో ప్రతీ మంగళవారం సాయంత్రం 5.35 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10.30 గంటలకు మహబూబ్‌నగర్ చేరుకుంటుంది. ఈ రైలు మార్చి 7 నుంచి ఏప్రిల్ 25వ తేదీ వరకు నడుస్తుంది. మహబూబ్‌నగర్–విశాఖపట్నం(08586) వీక్లీ స్పెషల్ మహబూబ్‌నగర్‌లో ప్రతీ బుధవారం సాయంత్రం 6.20 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైలు మార్చి 8 నుంచి ఏప్రిల్ 26వ తేదీ వరకు నడుస్తుంది. • **విశాఖపట్నం–తిరుపతి (08583)** వీక్లీ స్పెషల్ విశాఖపట్నంలో ప్రతీ సోమవారం రాత్రి 7 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ రైలు మార్చి 6 నుంచి ఏప్రిల్ 24వ తేదీ వరకు నడుస్తుంది. తిరుపతి–విశాఖపట్నం(08584) వీక్లీ స్పెషల్ ప్రతి మంగళవారం రాత్రి 9.55 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైలు మార్చి 7 నుంచి ఏప్రిల్ 25వ తేదీ వరకు నడుస్తుంది. • **విశాఖపట్నం–బెంగళూరు(08543)** వీక్లీ స్పెషల్ ప్రతీ ఆదివారం మధ్యాహ్నం 3.55 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.15 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. ఈ రైలు మార్చి 5 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు నడుస్తుంది. బెంగళూరు–విశాఖపట్నం(08544) వీక్లీ స్పెషల్ బెంగళూరులో ప్రతీ సోమవారం మధ్యాహ్నం 3.50 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 11గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైలు మార్చి 6 నుంచి మే 1వ తేదీ వరకు నడుస్తుంది. • **భువనేశ్వర్–తిరుపతి(02809)** వీక్లీ సూపర్ ఫాస్ట్ స్పెషల్ భువనేశ్వర్‌లో ప్రతీ శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.50 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ రైలు మార్చి 4 నుంచి ఏప్రిల్ 29వ తేదీ వరకు నడుస్తుంది. తిరుపతి–భువనేశ్వర్ (02810) వీక్లీ ప్రతీ ఆదివారం తిరుపతిలో రాత్రి 8 గంటలకు బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 4.30 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. ఈ రైలు మార్చి 5 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు నడుస్తుంది.

3న విశాఖపట్నం–అమృతసర్ దారి మళ్లింపు

నార్తర్న్ రైల్వే, నార్త్ సెంట్రల్ రైల్వే పరిధిలో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. ఈ మార్గంలో ప్రయాణించే విశాఖపట్నం–అమృత్‌సర్(20807) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ మార్చి 3న మళ్లించబడిన మార్గంలో వయా ఆగ్రా కంటోన్మెంట్, ఎత్మదపూర్, మిటవాల్, ఘజియబాద్, న్యూఢిల్లీ మీదుగా ప్రయాణిస్తుందని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం తెలిపారు.

కేఎఫ్‌సీలో తనిఖీలు

- నాణ్యత లోపించిన వంట నూనె వినియోగం
- కేసు నమోదు చేసిన ఆహార భద్రత అధికారులు

మహారాణిపేట: డైమండ్ పార్కు వద్ద ఉన్న కేఎఫ్‌సీ అవుట్‌లెట్‌లో శుక్రవారం ఆహార భద్రత అధికారులు తనిఖీలు చేపట్టారు. ఉపయోగించిన వంట నూనెను మళ్లీ వినియోగిస్తున్నట్టు తనిఖీల్లో గుర్తించి కేసు నమోదు చేశారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఫుడ్ లేవుట్లలో ఉపయోగించిన వంట నూనెను తిరిగి వినియోగిస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో.. ఆహార భద్రతాధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆహార భద్రత అధికారి నందాజీ ఆధ్వర్యంలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అప్పారావు కేఎఫ్‌సీ అవుట్‌లెట్‌లో తనిఖీలు చేపట్టారు. వంట నూనెల్లో టోటల్ పోలార్ కాంపౌండ్ (టీపీసీ) 25 శాతం కన్నా ఎక్కువ ఉంటే కేసులు నమోదు చేస్తారు. ఇక్కడ టోటల్ పోలార్ కాంపౌండ్(టీపీసీ) 32.5 ఉన్నట్లు గుర్తించారు. నాణ్యత ప్రమాణాలు లోపించిన వంట నూనెను వినియోగించడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతారని నందాజీ తెలిపారు. కేఎఫ్‌సీ అవుట్‌లెట్‌పై ఆహార భద్రత కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ అవుట్ లెట్ నుంచి 40 లీటర్ల వంట నూనెను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసు నిర్ధారణ జరిగితే.. రూ.2 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు.


వంట నూనె వినియోగంపై తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి అప్పారావు

ముగిసిన ఐఎన్ఎస్ సింధుకేసరి పర్యటన

సింథియా: ఇండోనేషియాలో ఐఎన్ఎస్ సింధుకేసరి పర్యటన ముగిసింది. ఈ నెల 22వ తేదీ నుంచి శుక్రవారం వరకు ఐఎన్ఎస్ సింధుకేసరి అధికారులు, సిబ్బంది జకార్తాను సందర్శించారు. పర్యటనలో భాగంగా ఇండోనేషియా నౌకాదళంతో అత్యంత స్నేహపూర్వక సంబంధాలు ఏర్పరచుకోవడం, సురక్షితమైన ఇరు దేశాల మధ్య సముద్ర భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే పరస్పర చర్యలపై ఇరుదేశాల అధికారులు చర్చలు జరిపారు.


ఇండోనేషియాలో భారత నౌకాదళ అధికారులు

వెటరన్.. అదిరెన్


బ్యాటింగ్ చేస్తున్న గంగరాజు

విశాఖ స్పోర్ట్స్: ఒకప్పటి క్రికెట్ ఆటగాళ్లు.. నేడు అడ్మినిస్ట్రేటర్లు.. వీరంతా కుర్రాళ్లైపోయారు. తమ నైపుణ్యాలు ప్రదర్శించి ఔత్సాహిక క్రికెటర్లను ఉత్సాహపరిచారు. జాతీయ జట్టుకు వికెట్ కీపర్‌గా సేవలందించిన తొలి ఆంధ్రా క్రికెటర్ ఎం.ఎస్.కె.ప్రసాద్, పూర్వ ఏసీఏ అధ్యక్షుడు గోకరాజు గంగరాజు, వీడీసీఏ కార్యదర్శి పార్థసారథి తదితరులు శుక్రవారం సందడి చేశారు. ఆనందపురం–తాళ్లవలస మధ్య ఎం.ఎస్.కె ప్రసాద్ నెలకొల్పిన క్రికెట్ అకాడమీ ప్రారంభ కార్యక్రమంలో ఎం.ఎస్.కె వికెట్ల వెనుక నిలవగా గంగరాజు బ్యాటింగ్‌లో ఆఫ్‌సైడ్ ప్రతిభను, పార్థసారథి స్పిన్ మాయాజాలాన్ని ప్రదర్శించారు.

వైశ్యరాజు జ్యుయలర్స్ షోరూం ప్రారంభం


షోరూంను ప్రారంభిస్తున్న ఎంపీ ఎంవీవీ

తగరపువలస: వైశ్యరాజు జ్యుయలర్స్ వారి నూతన షోరూంను శుక్రవారం అంబేడ్కర్ కూడలిలో విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల నమ్మకంతో దినదినాభివృద్ధి చెందుతున్న వైశ్యరాజు జ్యుయలర్స్ మరింతగా నాణ్యమైన సేవలందించాలని కోరారు. ఎంవీవీ బిల్డర్స్ అండ్ ఎస్టేట్స్‌కు చెందిన జామి భోజరాజు మొదటి కొనుగోలుతో సేల్స్ ప్రారంభించారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వైశ్యరాజు భద్రగిరిరాజు మాట్లాడుతూ ఇప్పటికే విశాఖ, గాజువాక, విజయనగరం, రాజాం తదితర ప్రాంతాల్లో షోరూంలు ఉన్నాయని.. ఏడో షోరూంను తగరపువలసలో ప్రారంభించామన్నారు. షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా 6 శాతం తరుగుతో అన్ని రకాల ఆభరణాలు, కిలో వెండిపై రూ.5 వేల వరకు తగ్గింపు ఇస్తున్నామన్నారు. జీఎస్టీ కూడా వినియోగదారులపై కాకుండా తామే భరిస్తామన్నారు. ప్రతి కొనుగోలుపై ఆకర్షణీయమైన బహుమతులు ఇస్తున్నామన్నారు. ఈ ఆఫర్లు 3 నుంచి 7 రోజుల వరకు ఉంటాయన్నారు. కార్యక్రమంలో చైర్మన్ వైశ్యరాజు ఫాల్గుణరాజు, డైరెక్టర్లు వైశ్యరాజు నరేష్‌రాజు, కిరణ్‌కుమార్ రాజు, జీవీఎంసీ 1, 2, 3 వార్డుల కార్పొరేటర్లు అక్కరమాని పద్మ, గాడు చిన్నికుమారి లక్ష్మి, గంటా అప్పలకొండ, జుగపల్లి సూరిబాబు, అక్కరమాని రాముునాయుడు, జగుపల్లి ప్రసాద్, స్థానిక వ్యాపారులు, వినియోగదారులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఎలియన్స్' అంతర్జాతీయ సదస్సు

మద్దిలపాలెం: అసోసియేషన్ ఆఫ్ ఎలియన్స్ క్లబ్స్ ఆధ్వర్యంలో సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఈ నెల 25, 26 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ పూర్వపు అధ్యక్షుడు బి.తిరుపతిరాజు, ప్రస్తుత అధ్యక్షుడు వి.ఎం.రావు తెలిపారు. మద్దిలపాలెంలోని కాకతీయ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం వారు సదస్సు వివరాలు వెల్లడించారు. శనివారం ఉదయం 10 గంటలకు ఎలియన్స్ జిల్లా సమావేశం, మధ్యాహ్నం 3 గంటల నుంచి ఇదే వేదికపై అంతర్జాతీయ సదస్సు జరుగుతుందన్నారు. వివిధ రాష్ట్రాలు, దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ సదస్సు హాజరవుతున్నట్లు చెప్పారు. రాష్ట్రాలు, జిల్లాల వారీగా చేపట్టిన, చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలపై చర్చ సాగుతుందని తెలిపారు. ఉత్తమ సేవలందించిన సభ్యులకు అవార్డులు అందజేస్తామన్నారు. 26వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటలకు బీచ్‌రోడ్‌లో వైఎంసీఏ నుంచి కాళీమాత ఆలయం వరకు దేశ, విదేశాలకు చెందిన ప్రతినిధులతో కల్చరల్ పరేడ్‌ను సంప్రదాయ వస్త్రధారణలో.. ఆయా దేశాల సంస్కృతి ప్రతిబింబిచేలా నిర్వహిస్తామన్నారు. ఈ శోభాయాత్ర ద్వారా ఎలియన్స్ ఐక్యతను చాటుతామన్నారు.